క్లుప్తంగా

క్రీడల్లో గెలుపోటములు సహజం

పెంచికల్‌పేట్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్, మాజీ సర్పంచ్ సుధాకర్, యువకులు సాయికిరణ్, సురేశ్, నారాయణ, సిద్ధు, శ్రీనివాస్, యువకులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత 'చింతలమానెపల్లి'

కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో ముద్రకోళ్ల సురేశ్ జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల్లో 36 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో కౌటాల– చింతలమానెపల్లి జట్లు తలపడ్డాయి. పోటీల్లో చింతలమానెపల్లి జట్టు మొదటి బహుమతి గెలుపొందగా, కౌటాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు డబ్బా బాపు, గోపాల్, రమేశ్, పీఈటీ ఎంఎల్ రాజు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛభారత్'



శ్రమదానం చేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద వాసవి క్లబ్ సభ్యులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ మాట్లాడుతూ గాంధీ చూపించిన అహింసా, శాంతి మార్గంలో ప్రతీ ఒక్కరు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆదిత్య, ప్రతినిధులు శ్రీధర్, ఎకిరాల శ్రీనివాస్, గుండా ప్రమోద్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, పిన్నా వివేక్, చిలువేరు వెంకన్న పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న 8 మంది విద్యార్థులు సంతూరు విప్రో కేర్ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న గీత, లత, రంజిత, శ్రీలత, అశ్విని, సుజాత, అంజలి, వైశాలిలు ఎంపిక కాగా, వీరికి మూడేళ్లపాటు ఉపకార వేతనాలు అందనున్నట్లు పేర్కొన్నారు. వీరికి ఒకొక్కరికి మూడు సంవత్సరాలకు గాను రూ.72వేల వంతున ఉపకార వేతనాన్ని సంతూర్ విప్రో కేర్ కంపెనీ అందిస్తుందన్నారు.

'సీఎం పర్యటన అడ్డుకుంటాం'

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల సమస్యల పరిష్కారంపై స్పష్టమైన వైఖరి తెలియజేయకుంటే ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లా పర్యటనను అడ్డుకుంటామని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 2న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నారని, ఆ లోగా స్పష్టమైన హామీలు ఇవ్వాలని కోరారు. చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని అన్నారు. ఐటీడీఏ పరిధిలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీ వేయాలని, ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూ ములకు ఎలాంటి షరతులు లేకుండా పట్టా లు ఇవ్వాలని, పెసా చట్టం పకడ్బందీగా అ మలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సెడ్మకి తుకారం, సకా రాం, పెందోర్ శంకర్, సిడాం భీంరావు, లేకం భీంరావు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కౌటాల: మండలంలో బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పర్యటించనున్నట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు మండలంలోని కన్నెపల్లిలో, తుమ్మిడిహెట్టి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

దిగుబడిపై చీడపీడ

- జిల్లాలో 40,144 ఎకరాల్లో కంది సాగు
- మార్కెట్‌లో పంటకు డిమాండ్



కంది పంట పడుతున్న రైతులు (ఫైల్)

కౌటాల: జిల్లాలోని కంది రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ కాలంలో సకాలంలో వర్షాలు కురవకపోవడం.. పొగమంచు కారణంగా చీడపీడలు ఆశించి కంది పంట దిగుబడి బాగా తగ్గింది. కంది సాగు చేస్తే ఏటా నష్టాలే వస్తున్న పరిస్థితుల్లో సైతం కోటి ఆశలతో, ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి పంటలు సాగు చేసినప్పటికీ దిగుబడి ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఎకరానికి ఆరు క్వింటాళ్లకు తగ్గకుండా పంట తీసిన రైతులు ప్రస్తుతం ఎకరానికి మూడు క్వింటాళ్లకు మించి పంట రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

ఎన్నో ఆశలతో సాగు..

జిల్లాలో కంది పంటను ఏటా విస్తారంగా సాగు చేస్తున్నారు. 2023 వానాకాలం సీజన్‌లో బోర్లు, బావులు, వర్షాధారం కింద సాగు చేశారు. బోర్లు, బావుల కింద 30శాతం సాగు చేస్తే, వర్షాధారం కింద 70శాతం కంది పంట సాగైంది. ఆరు నెలల కంది పంటను ఏటా రైతులు ఇష్టంగా సాగు చేస్తారు. వర్షాలు తక్కువగా కురిసినా, చలి కాలంలో తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా పంట తప్పకుండా చేతికొస్తుందన్న ఆశతో సాగు చేస్తుంటారు. జిల్లాలో ఈసారి 40,144 ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. 2.40 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. కంది పంటలో ఈసారి చీడపీడలు సోకడంతో పూత రాలడంతో దిగుబడి చాలా వరకు తగ్గింది.

మార్కెట్‌లో మంచి ధర..

జిల్లాలోని రైతులు ఇటీవల కంది కోతలు పూర్తి చేసి ప్రస్తుతం పంట నూర్పిడి చేస్తున్నారు. ప్రస్తుతం కంది పంట నూర్పిడి జరిగి పంట ఇంటికొచ్చింది. జిల్లాలో కంది పంట అమ్మకం జోరుగా కొనసాగుతుంది. ఓ వైపు ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి గణనీయంగా తగ్గినా ఈసారి మార్కెట్‌లో కందికి మంచి ధర ఉండడంతో రైతులకు కొంత ఉపశమనం కలిగింది. కందికి ప్రారంభంలో క్వింటాలుకు రూ.10 వేలకు పైగా పలికిన ధర రైతుల చేతికి పంట రాగానే రూ.8 వేలకు పడిపోయింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7 వేలు ఉంది. మద్దతు ధర కంటే మార్కెట్‌లో ఎక్కువే ఉన్నా.. పప్పుల ధర భారీగా పెరగడంతో వాణిజ్య కొనుగోళ్లు చేపట్టాలని మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం ఆదేశించింది. కాగా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఎక్కువగా కంది సాగు చేస్తామని, రైతులకు అనువుగా ఉండే కౌటాల మండల కేంద్రంలో కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం కంది పంటకు రూ. 15 వేలు మద్దతు ధర కల్పించి, రైతులను ఆదుకోనేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తగ్గిన దిగుబడి

కంది పంట సాగు చేసి ఆర్థికంగా లబ్ధిపొందాలనుకుంటే ఏటా కంది పంట సాగుతో నష్టాలే అధికంగా వస్తున్నాయి. నేను ఐదు ఎకరాల్లో పత్తి పంటలో అంతర పంటగా కంది చేశాను. ఈసారి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో కంది పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ప్రభుత్వం రూ.15 వేలకు మించి మద్దతు ధర పెంచాలి. కౌటాలలో కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. - విశ్వనాథ్, రైతు, కనికి

ప్రజల ఆరోగ్యంపై కేంద్రం ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



గిరవెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: ప్రజల ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని గిరవెల్లి గ్రామంలో నూతనంగా రూ.20 లక్షలతో సబ్‌సెంటర్ భవనంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తే సబ్ సెంటర్‌లలో వచ్చి వైద్యం చేయించుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వం వైద్యులను నియమించిందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కంబగౌని సులోచన, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, సహకార సంఘం చైర్మన్ కొంద్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, సర్పంచులు రాజన్న, సంజీవ్, సందికట్ల రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

చింతలమానెపల్లి: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనకు ప్రజలు పలు సమస్యలపై వినతులు సమర్పించారు.

ఎమ్మెల్యే పూజలు..

మండలంలోని రవీంద్రనగర్1లో శివుని విగ్రహానికి ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో శివుడి విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో గీతాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులతో కలిసి మాట్లాడారు. ఆయనతో పాటు నాయకులు ఎల్ములె మల్లయ్య, మాధవ్ సర్దార్, దుబ్బుల మురళి, పరేష్ కవిరాజ్, గణేష్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జైరాం

ఆసిఫాబాద్‌అర్బన్: ఫిబ్రవరి 3వ తేదీన హైదరాబాద్‌లోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్, రాఘవేంద్రనగర్, నాచారంలో నిర్వహించే ఆరె కుల (ఓబీసీ) సాధన కోసం నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరాం పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శివాజీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆరె కులానికి ఓబీసీ సర్టిఫికెట్ లేకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిక్కాజి, ప్రధాన కార్యదర్శి సప్త శ్రీనివాస్, నాయకులు బాబా, గోపాల్, తిరుపతి, అన్నారావ్, సుభాష్, గెడేకర్ సంతోష్, కిషన్, రాజు, జానకిరావ్, మహేష్, ప్రభాకర్, నాందేవ్, భామనకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై పార్టీలు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో సురేశ్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, 2024లో భాగంగా 6, 7, 8 ఫారాల ద్వారా అందిన దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఫిబ్రవరి 2 వరకు అభ్యంతరాలు తెలపాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తుది జాబితాను ఫిబ్రవరి 8న ప్రకటిస్తుందని తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో 21,009 దరఖాస్తులు వచ్చాయని, ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీలు సహకారం అందించాలన్నారు. ఎన్నికల డీటీ జితేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులను గణితంపై పలు ప్రశ్నలు వేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఎస్‌వో శ్రీనివాస్, సుభాష్, పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో కుష్ఠు వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వాంకిడి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శివకేశవ్ నగర్ ప్రాథమిక పాఠశాలల్లో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రతీ గ్రామంలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తల ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్యుడు ఉప్రె వినయ్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, కళాశాల ప్రిన్స్‌పాల్ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ పుష్పాల లక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పంచాయతీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. వైద్యురాలు స్పందన, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్లు

కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కాగజ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పీహెచ్‌సీలో వైద్యాధికారి అశ్వినికి సమ్మె నోటీసు అందజేశారు. ఆశా వర్కర్లు జ్యోతి, వనిత, లక్ష్మి, సమీనా, స్వరూప, సురేఖ, సరస్వతి, అనిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, శంకర్‌లు అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) కాగజ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు సమ్మె నోటీసు ఇచ్చారు. నాయకులు శంకర్, సంజీవ్, మల్లేశ్, రమేశ్, భూమయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీని నియమించాలి



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న శ్యాంనాయక్

రెబ్బెన: జిల్లాలో ఎంతో ప్రసిద్ధి గాంచిన గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ నియామకం త్వరగా చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ అన్నారు. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.

వరిగడ్డి కట్టలు దగ్ధం



దగ్ధమవుతున్న వరిగడ్డి కట్టలు

రెబ్బెన: మండలంలోని రాజారాం గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు వరిగడ్డి కట్టలకు నిప్పంటుకొని అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుడు పూదరి ఆశయ్య తెలిపిన వివరాల ప్రకారం ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో నిల్వ ఉంచిన వరిగడ్డి కట్టలు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నాయి. గమనించిన స్థానికులు ఆసిఫాబాద్ అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించటంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో 320 వరిగడ్డి కట్టలు దగ్ధం కాగా వాటి విలువ సుమారు రూ. 30వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

అధికారులకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీడీవో రమాదేవి

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ సమీపంలో ఫిబ్రవరి 4 నుంచి మూడు రోజులు కొనసాగే పోతురాజు, ధర్మరాజు పూజలకు ఆలయ కమిటీ సభ్యులు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా, డీటీడీవో రమాదేవి, ఏటీడీవో పురుషోత్తంను ఆహ్వానించారు. ఉట్నూర్, ఆసిఫాబాద్, జైనూర్‌లోని వారి కార్యాలయాలకు మంగళవారం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఎంపీపీ మోతిరాం, ఏపీవో భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు సిడాం రాజు, సిడాం ధర్మూ, దేవు, లచ్చు, భీంరావు, వసంత్, ఉన్నారు.

సర్పంచులకు వీడ్కోలు సమావేశం



సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ జాజిమొగ్గ సుజాత ఆధ్వర్యంలో మంగళవారం సర్పంచ్‌లకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో సర్పంచ్‌లు, పంచాయతీ పాలక వర్గాల పనితీరు వెలకట్ట లేనిదన్నారు. అనంతరం సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను శాలువాలతో సన్మానించారు. జెడ్పీటీసీ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సంజీవ్, ఎంపీటీసీ రాజన్న, సర్పంచ్‌లు చౌదరి సుజాత, దాసరి చంద్రమౌళి, తోరె కళావతి, ఘనపురం కావ్య, మేకల కమల, జాజిమొగ్గ శ్రీనివాస్, దుర్గం రాజన్న, పాలె సుధాకర్, పొర్తెటి ఈశ్వరిబాయి, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

కౌటాల: గ్రామాలాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ అనూష, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంఈవో సోమయ్య, ఏపీవో పూర్ణిమ, ఏపీఎం వెంకటరమణ, కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ అలీ, ఏవో రాజేశ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఎంపిక



ముడిమడుగుల సౌజన్య



బొర్కుట్ లలిత



కామెర హేమ



స్వర్ణ

దహెగాం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు ఆదివారం వెలువడగా మండలానికి చెందిన నలుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ముడిమడుగుల సౌజన్య, పీకలగుండం గ్రామానికి చెందిన బొర్కుట్ లలిత, కామెర హేమ, ఐనం గ్రామానికి చెందిన స్వర్ణ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

సంక్షిప్త వార్తలు

డిగ్రీ కళాశాలలో 'సాహిద్ దివస్'

ఆసిఫాబాద్‌రూరల్: అమరవీరుల త్యాగాలు మరవనివని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో సాహిద్ దివస్ సందర్భంగా ఎన్‌సీసీ టీం విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు.

1న హార్డ్‌వేర్ షాపుల బంద్

కౌటాల: కౌటాలలోని హార్డ్‌వేర్ షాపులను ప్రతీ నెల 1వ తేదీన బంద్ ఉంచాలని నిర్ణయించినట్లు సంఘం ప్రతినిధులు పెద్దపల్లి హన్మంతు, కార్తీక్, కిశోర్, శంకర్‌గౌడ్ మంగళవారం తెలిపారు. ప్రతీ హార్డ్‌వేర్ షాపు దుకాణదారుడు షాపును మూసి ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమించి షాపును ఓపెన్ చేస్తే కమిటీ ఆధ్వర్యంలో రూ. 10వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

జైనూర్: సీసీఐ ద్వారా రెండు జిన్నింగ్ మిల్లుల్లో జరుగుతున్న పత్తి కొనుగోళ్లు వచ్చే నెల 1వ తేదీ నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలతో పాటు పత్తి గింజల నిల్వలు పెరగడంతో కొన్ని రోజుల పాటు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నామన్నారు.

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొటం శ్యాంసుందర్, తిరుపతి మాట్లాడుతూ త్వరలో 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం జరగడంతో పాటు సీపీఎస్ రద్దు తదితర సమస్యలపై పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా శివరాజ్, ఉపాధ్యక్షుడిగా సతీశ్, జగదీశ్, గౌతమి, కార్యవర్గ సభ్యులుగా మహేందర్, సాయికుమార్, నాగేందర్, ప్రవళిక, స్పందన, లక్ష్మణ్, రాజేందర్ తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా కోశాధికారి గజానన్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

వాంకిడి: ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు సాగించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెంచికల్‌పేట్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. మండలంలోని మెరెగూడ గ్రామంలో మంగళవారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

శిలాఫలకంలో తప్పులు



తప్పుగా ముద్రించిన ఎంపీపీ పేరు, మండలం

చింతలమానెపల్లి: మండలంలో మంగళవారం నిర్వహించిన ఆయుష్మాన్ మందిరం పల్లె దవాఖానా ప్రారంభోత్సవ శిలాఫలకంలో తప్పులు దొర్లడంతో అధికారులపై ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకంలో గ్రామాల పేర్లు, ప్రజాప్రతినిధుల పేర్లు తప్పుగా ముద్రించారు. ఎంపీపీ పేరును తప్పుగా ముద్రించడంతో పాటు మండలాన్ని ఆసిఫాబాద్‌గా పేర్కొన్నారు. ప్రారంభోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు.

'బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి'



పాయల్ శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

జైనూర్: బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం పాయల్ శంకర్ మండలానికి రాగా స్థానిక బీజేపీ నాయకులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పాయల్ శంకర్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. నాయకులు రాథోడ్ సందీప్, శివాజీ తదితరులు ఉన్నారు.